# నిమిత్త మాత్రులు

రోహిణీకార్తి ఎండలు! రోళ్ళు బద్దలు కొడుతున్నాయి. ఫేను క్రింద కూర్చున్నా వేడిగాలి తప్ప ప్రాణానికి సుఖం ఏది? వడగాల్పు ఆ చెవినించి ఈ చెవికి కొడుతోంది.

ఎంత చికాకుగావున్నా తప్పదుగనక అలాగే ఆపసోపాలు పడ్తూ కూర్చుని పేపర్లు దిద్దుకున్నాను. ఈ పేపర్లు వారం లోపల వదుల్చుకోవాలి! అప్పుడిక కాస్త ఊపిరి ఫీల్చుకోడానికి అవుతుంది. ఏవూరైనా సరదగా వెళ్ళి తిరిగిరావాలి! వెళ్ళబోయే చోటుగురించి: అక్కడ గడుపబోయే రోజులగురించి మనసు ప్లాను వేస్తూంది. అలవాటుగా, యాంత్రికంగా కళ్ళు పేపర్లమీద నిలిపాను అలవాటయిన చేతులు తమపని అవి చేస్తున్నాయి.

వీధి తలుపు ఎవరో కొడ్తున్నారు. చేస్తున్న పని ఆపి వెళ్ళడానికి బద్ధకం వేసింది. ఇంత ఎండలో ఎవరొచ్చారో, కొంపమునిగినట్లు! మళ్ళీ రెండుసార్లు కొట్టారు ఎవరో. తప్పక, విసుక్కుంటూ లేచివెళ్ళి తలుపు తీశాను.

గుమ్మంముందు ఎండలో కళకళలాడుతూ ఓ ఎంబాసిడర్ కారాగి వుంది. మెట్లమీద ఓ వ్యక్తి నిల్చుని నన్ను చూడగానే నమస్కారం చేశాడు. ప్రతి నమస్కారం చేశాను. ఆయనెవరో ఎక్కడా చూసిన గుర్తయినాలేదు నాకు. లోపలికి రమ్మనాలో వద్దో తేల్చుకోలేక ఒక్కక్షణం అలా నిలబడ్డాను. ఆయన తనని పరిచయం చేసుకుంటాడేమోనని.

"మీతో సిన్న పనివుండి వచ్చానమ్మా!" అన్నాడు ఆయన తనెవరో చెప్పకుండానే.

"లోపలికిరండి" దారితీస్తూ అన్నాను.

లోపలికి వెళ్ళగానే టేబుల్ మీద చిందర వందరగావున్న పేపర్లని గబగబ డ్రాయరులో పెట్టాను, నేను దిద్దే పేపర్లు మరొకరి కంట పడడం నా కిష్టంలేదు. అయినా, ఈ లోపల ఆయన చూడనే చూశాడు." పేపర్లు దిద్దుకుంటున్నట్టున్నారు, మీపని "పాడుచేశాను గాబోలు!" ఆదోరకంగా ఆ పేపర్లవంక చూస్తూ అన్నాడు.

"పర్వావాలేదులెండి!" మర్యాదకి అన్నాను.

ఆయన మాటల్లో యాస ఆ వేషంచూస్తే డబ్బుగల కమ్మలో, రెడ్లో అని తెలిసిపోతూంది. పల్చటి గ్లాస్కో లాల్చి, పంచ, ఖరీదుగల చెప్పులు, ఎనిమిది వేళ్ళకి ధగధగలాడే రాళ్ళ వుంగరాలు, గోల్డువాచి, పీధిలో, ఎంబాసిడర్ అన్నీ అతని కున్న డబ్బునే చాటుతాయి అందరికీ. నాతో ఆయన కేంపనో నాకు అర్థంకాలేదు.

"నా పేరు యీరపరెడ్డి అంటారండి మాది గోపన్నపాలెం...."అని నమ్రంగా అన్నాడు వచ్చి కూర్చున్న ఐదు నిమిషాలకి.

"అహా....ఏంచేస్తుంటారు మీరు?...." ఏదో అడగాలని అడిగాను.

"ఆ....ఏదో.... రెండు పంచదార మిల్లులు రెండు రైసుమిల్లు లున్నాయి.... అవి సూసుకుంటాను....ఇంకా చెరుకుతోట హైదరాబాదు కాడ ద్రాక్షతోట అదీ వుందనుకోండి....మాలాంటి వోళ్ళకి ఏదో యిలాటి యాపారాలు తప్ప ఉద్యోగాలు సద్యోగాలు ఏం సేస్తాం సెప్పండి."

రెండు పంచదారమిల్లులు, రైసుమిల్లులు పొలాలు తోటలు వున్న వాడికి వెధవ ఉద్యోగం ఎందుకు?....యింతకీ యితనికి నాతో ఏంపనో అడగందే చెప్పేట్లు లేదు!

"ఏం పనిమీదవచ్చారో చెప్పాడుకాదు...."

"హీ....హీ.... ఓసారి తమ దర్శనం సేసుకుందామని ..." ఓ వెకిలి నవ్వు నవ్వి చేతులు నలుపుకున్నాడు నసుగుతూ.

నా దర్శనం! నేనేం దేవతనా ఏం-సినిమా తారనా, పోనీ ఏ మంత్రినా? పోనీ ఏ లక్షల కధికారిణినా? నా దర్శనం చేసుకుంటే అతనికేం లాభం? ఆ నసుగుడు చూస్తుంటే వళ్ళు మండుతూంది. చెప్పేదేదో త్వరగా చెప్పేయకూడదూ?

"తమవల్ల, సిన్న ఉపకారం కావాలి...."మళ్ళీ ఆగాడు.

"నావల్ల మీకేం ఉపకారం జరుగుతుంది. మీలాంటివాళ్ళకి నాలాంటి మామూలు కాలేజీ లెక్చరరు చేసే ఉపకారం ఏముంటుందండి!...." నవ్వుతూనే అంటించాను.

"అమ్మమ్మ....అలా అనకండి— తమరి సేతుల్లో లేనిదేముంది....మీరు తల్చుకోకపోతే తమరు కాస్త దయుంచకపోతే మా లాంటోళ్ళం ఎలా రోజులు నెట్టుకు రాగలం సెప్పండి...."

పొగిడి, ఉబ్బేస్తున్నాడు? ఎంత బింకంగా వుందామన్నా నా మొహంలో ప్రసన్నత కని పెట్టినట్టున్నాడు. మరికాస్త నమ్రతగా, వినయంగా "తమరి గురించే కాలేజీలో మా గొప్పగా సెప్పుకుంటారట, సాలా బాగా పాఠాలు చెప్తారని చాలా స్ట్రిక్ట్ అని...."

"అ....అ మాటలకేంలెండి...." ఇష్టం లేనట్టుగా మాట త్రుంచేశాను. ఎంత సేపు కూర్చున్నా, అసలు సంగతి చెప్పకుండా అతను చేసే కాలయాపన చూస్తుంటె చిరాకు పుట్టుకొస్తూంది నాకు.

"ఇంతకీ, మీ పని ఏమిటో చెప్పండి...." కాస్త అసహనంగా అడిగాను.

"అబ్బే! ఏం లేదు. పెద్ద పని కాదనుకోండి. మీరు శ్రమ అనుకోకపోతే.... కాస్త శ్రమ తీసుకుని....

"ఊఁ. చెప్పండి—"

"అదే, తవఁకాడికి మా వాడి పి. యు. సి. కెమిస్ట్రీ పరీక్ష పేపర్లు వచ్చాయని తెలిసింది."

"ఇదా సంగతి! నే నెంత మూర్ఖురాలిని? పరీక్ష లయ్యాక నా దగ్గరికి వచ్చే అపరిచితులు నా సహాయం అపేక్షించి వచ్చేవారయి వుంటారు. నా వల్ల ఎవరికన్నా కావల్సిన పని అవొకచేనని, నా వల్ల జరిగే ఉపకారం అవొకచేనని ముందే నాకెందుకు తట్టలేదో! ఆయన వచ్చిన పని తెలిశాక నా మొహంలో ప్రసన్నం పోయి గంభీరత అలుముకుంది.

"ఎలా తెల్సింది? ఎవరు చెప్పారు?"

"దాందే ముందండీ, ఎవరు సెపితేనేం. మీ కాడకొచ్చినాయి ఆ పేపర్లని నిక్కచ్చిగా తెలిసిందినాకు...." వెకిలి నవ్వు ఒకటి నవ్వాడు.

అవును నిజమే. తెల్సుకోడం ఏంకష్టం. డబ్బుతో జరగని పనులు ఏముంటాయి యీ లోకంలో. డబ్బుకి దాసోహం అనని వాళ్ళెంత మంది వుంటారు!

"అయితే, ఏం అంటారు ఇంతకి మీరు?"

"తమరు కాస్త దయుంచి మావాడి నంబరు పేరును చూసి ఎన్ని మార్కులొచ్చినయో సెపితే మీ మేలు మరువను...."

"క్షమించాలి! అలాంటివి మీరడకూడదు, మేం చెప్పకూడదు....అసలు మీరిలా రావడం, అడగడం తగిన పనికాదు! ఎవరికైనా తెలిస్తే నా ఉద్యోగానికి ఎంత ముప్పో తెలుసు మీకు!" కఠినంగా అన్నాను.

"అమ్మమ్మ—అదెలా తెలుస్తుంది మూడో కంటివాడికి ఈ మాట తెలియనిస్తానా....అ భయం మీ కొద్దు...." అభయం ఇస్తూ మాట్లాడాడు.

"ఎవరికి తెల్సినా మానినా, అలాంటి పనులు చేయడం నా ఉద్యోగ ధర్మానికి విరుద్ధం....మీరు దయుంచి నన్ను ఇబ్బందిలో పెట్టకండి...." నా నిశ్చయం మారనట్టు గట్టిగా నొక్కి చెప్పాను.

ఆయన ఒక్కక్షణం నిరాశ పడ్డట్టు మొఖం పెట్టాడు. వెంటనే ఆ మాత్రానికే డీలా పడిపోతే ఎలా అన్నట్టు ఓ నవ్వు నవ్వి, రెండు చేతులు జోడించి నమస్కారం పెట్టాడు. "అమ్మమ్మ మీరిలా అనేస్తే ఎలా అమ్మా. మీ మీద ఆశ పెట్టుకుని యింతదూరం వచ్చాను....యీ మాత్రం సాయం మీరు చేయక తప్పదు. ఎవరికి తెలుస్తుందేమోనన్న సందేహం మీకెంతమాత్రం అక్కరలేదు. కాస్త పేపరుచూసి పేనయ్యాడో లేదో చెప్పేస్తే చాలు....ఒక్కక్షణం ఆగి మీ కష్టం వుంచుకోను.... ఏదో నా శక్తికొద్ది జేబులోంచి ఓ కవరు తీసాడు.

లంచం యిస్తాడన్నమాట! ఎంత ధైర్యంగా మొహం ఎదటే చెపుతున్నాడు నా వళ్ళు మండింది. తక్షణం బయటికి గెంటాలన్న ఆవేశం వచ్చినా పెద్దమనిషి, అంతలా అమర్యాదగా మాట్లాడి పొమ్మనలేకపోయాను....

"చూడండి....నా కిలాంటివి ఇష్టంలేదు....యిలాంటి అవినీతి పనులకి పాల్పడటం నాకు చేతకాదు. దయచేసి మీరు నన్ను ఇరకాటంలో పెట్టి బాధ పెట్టకండి...." అంతకంటె కఠినంగా యింకెలా చెప్పాలో ఆ క్షణంలో నాకు తెలియ లేదు....

అబ్బే తవర్ని బాధపెట్టడం నాకు మాత్రం ఇష్టమా? ఒకరి కష్టం వుంచు కోవడం నా కిష్టం లేదు....ఉత్తినే ఏ పని ఎవరిచేత చేయించుకోవాలన్నా నా కదోలా వుంటుంది....అంచేత అన్నాను సుమండీ....ఏదో సంతోషంతో ఇచ్చినదాన్ని మీరు కాదనకూడదు....అంటూ టేబిల్ మీద కవరు తెచ్చిపెట్టాడాయన. గుమ్మం దగ్గరి కెళ్ళి డ్రైవర్ని కేకేశాడు. డ్రైవరు ఏదో బుట్టతెచ్చి లోపలపెట్టాడు....మా ద్రాక్ష తోటలో కాసిన ద్రాక్షలండి. అనాబ్‌షా ద్రాక్షల రుచి మరి ఏ ద్రాక్షకి రాదుకదండి.... అతి నైపుణ్యంతో సంభాషణ సాగిస్తున్న ఆయన నాకు మాట్లాడడానికి అవకాశం యీయలేదు. ఆయన కెలా చెప్పాలో అర్థంకాని స్థితిలో పడ్డాను.

"చూడండి యిలాంటి లంచాలు అవి తీసుకుని పనులు చేయడం నాకు అలవాటు లేదు. దయచేసి ఈ కవరు తీసేయండిక్కడినించి.

"అమ్మమ్మ....లంచం ఏమిటండీ....ఛీ....ఛీ....లంచం ఇస్తానా మీ లాంటి వారికి....సంతోషంతో యిచ్చిన కానుక."

పోనీ లంచం కాకపోతే.... కానుక. ఇలాంటి కానుకలు పుచ్చుకొనే అలవాటు నాకు లేదు....మీకు నేను ఏం సహాయపడలేనందుకు క్షమించండి...." కాస్త కఠినంగా అన్నాను.

ఆయన నిస్సహాయంగా చూశాడు...."ఏదో మిమ్మల్ని నమ్ముకుని యింత దూరం వచ్చాను....ఈ కాస్త సాయం చేసిపెట్టండి....కాదనరని వచ్చాను...."

"అసలు మీకు మీ అబ్బాయి ప్యాసవుతాడన్న నమ్మకం వుందా? ప్యాసవుతాడని మీకు నమ్మకంవుంటే మార్కుల సంగతి అడగనే అక్కరలేదు. ప్యాసు కాని పక్షంలో మార్కులెన్ని వచ్చాయో తెలుసుకుని మాత్రం ఏం చేయగలరు?" ఆయన అసలు వుద్దేశం రావడానికి గడుసుగా ప్రశ్నించాను.

ఆయన కొంత ఇబ్బందిగా చూశాడు. "అ....అ....అదేనండీ ఆదు కొంత పేపరు పాడుచేసానంటున్నాడు....అందుకే కొంతంత ఆరాటం...."

అయితే కేవలం మార్కులెన్ని వచ్చాయో చూసి చెప్పమనికాదు ఆయన కోరిక. ఆ తక్కువ మార్కులు వేయమంటాడు చెప్పాక. ఖచ్చితంగా తన వల్ల కాదని ముందే చెప్పి పంపేయాలి.

"పేపరు పాడుచేసానని అబ్బాయి అంటుంటే మార్కులు తెలుసుకుని మాత్రం మీరేం చేస్తారండి...."

"తమ దయుంటే సేయలేనిది ఏముంటుంది సెప్పండి....చేతులు నలుపుకుంటూ అన్నాడు అదోలా నవ్వుతూ.

ఆయన అసలు ఉద్దేశం స్పష్టంగా అర్థం అయింది.

"మీరు నన్ను క్షమించండి....అలాంటి పనులు చేయడం నావల్ల కాదని ముందే చెప్పాను. మీరింక నా కాలం మీ కాలంకూడా వృథాచేయడం మంచిది కాదు....ఈ కవరు తీసుకోండి. ఇలాంటివి నాకు అలవాటులేదు" లేచి నిలబడి కవరుతీసి అతనికి అందించాను. ఆయన తీసుకోలేదు.

"తవరికి క్రొత్త చిన్నవారు అలవాటులేదు గాబోలు....కాని యిలా ఎంతో మంది చేస్తుంటారు. ఇందులో తప్పేం వుంది సెప్పండి. మనలాంటి వాళ్ళం ఏదో న్యాయంగా వుండాలంటే మాత్రం యీ ప్రపంచంలో కుదురుతుందా మహా మహా వాళ్ళే సేయగాలేంది మనలాంటివారం ఎంత? నలుగురితోపాటే మనమూ నడవాలి...." నిల్చోపెట్టి ఆయన బోధిస్తున్న నీతులు వింటూంటే వళ్ళు మండుకొచ్చింది.

"నలుగురి సంగతి నాకు అక్కరలేదు. నాకు న్యాయం అని తోచింది చేస్తాను....రూల్సుకి వ్యతిరేకంగా వెళ్ళడం నాకిష్టంలేదు....అయినా మీరు యింత డబ్బుగలవారు. మీ అబ్బాయి ఓ ఏడాది పరీక్ష తప్పినంత మాత్రాన మీకు వచ్చే నష్టం ఏముండదు. అబ్బాయి పరీక్ష ప్యాసయి ఏదో నాలుగురాళ్ళు తేస్తేనేగాని రోజు గడవని వాళ్ళు పరీక్షకోసం ఆరాటపడ్డారంటే అర్థం వుంది మీకేం లక్షాధికార్లు అబ్బాయి చదివి ప్యాసయినా ప్యాస కాకపోయినా ఉద్యోగం చేయాలన్న బాధ ఏం లేదు. ఈసారి కాకపోతే మరొకసారి అవుతాడు. దానికోసం మీరింత ఆరాటపడడం అనవసరం అంటాను...."

"అమ్మమ్మ అలా అనేయకండి. మావాడ్ని డాక్టరు చదివించాలని నాకెంతో కోరిక. ఎలాగైనా యీ పరీక్ష ప్యాసయిపోతే డాక్టరు పరీక్షకి చదివించేస్తాను వాడిని....సీటు గట్రా అంతా ఏర్పాటు చేసేశాను....పరీక్ష ప్యాసయిపోయాడనిపించు కుంటే చాలు. మిగతాదంతా నేను చూసుకుంటాను. అందుకే తవకాడికి ఇంత అర్జంటుగా పరిగెత్తుకు వచ్చాను. కాస్త దయుంచి మావాడి పేపరుచూచి పెట్టండి అమ్మా...యీ సిన్న సాయంచేస్తే చాలు..."

అంటే ఈ పరీక్ష ఎలాగో అలాగ మార్కులు వేయించన్నా ప్యాసు చేయించి ఏ మెడికల్ కాలేజికో డొనేషన్ కట్టి మెడిసన్‌లో చేర్పిస్తాడన్న మాట కొడుకుని! హా....డబ్బుంటే ఈ లోకంలో చేయలేని పనులేముంటాయి. ఇలాంటివాళ్ళు పరీక్షలు ప్యాసుకాని వాళ్ళందరూ డబ్బిచ్చి ఏ కాలేజీలోనో సీటు సంపాయించడం. అక్కడో పదేళ్ళు చదివి ఎప్పటికో డిగ్రీ చేతబట్టుకోవడం, సవ్యంగా ప్యాసకాకపోతే మళ్ళీ డబ్బు కుమ్మరించి డిగ్రీ తీసుకోవడం ఇలా వున్నాయి యీ రోజుల్లో చదువులు! ఇలాంటి చదువులు చదివి, దేశాన్ని ఉద్ధరించటానికి పూరిమీద పడుతూంటే మన దేశం యింతకంటె ఎలా బాగుంటుంది. రేపొద్దున్న యీ అబ్బాయి... యీనాడు పి. యు. సి. పరీక్ష స్వశక్తితో ప్యాసు కాలేకపోయినా డాక్టరయిపోతాడు! బోర్డు కడతాడు! లక్ష లార్జిస్తాడు. రోగాలకి సరిగా మందులీయడం చేతకాపోయినా.... పరవాలేదు. డిగ్రీ వుంటే చాలు. ఆ డిగ్రీ రావడం కోసం ఎంతటి అవినీతి కయినా పాల్పడతారు. ఎంత డబ్బయినా కుమ్మరిస్తారు. అఫ్‌కోర్స్ ఇప్పుడు ఖర్చు పెట్టిన డబ్బుకి పదింతలు. డాక్టరు డిగ్రీ చూపించి పెళ్ళిళ్ళ మార్కెటులో సునాయాసంగా ఆ నష్టాన్ని భర్తీ చేసుకోవడమేకాక లాభం తీస్తారు. ఎంత లేదన్నా యీ డాక్టరు పెళ్ళికొడుకుని వేలంలో నిలబెట్టి లక్ష రూపాయలపాట పాడిస్తాడు యీ తండ్రి ఆ లక్షముందు ఇప్పుడు ఖర్చుపెట్టిన పది పదిహేనువేలు ఎంత! అంతా డబ్బు మహత్యం. ఆ డబ్బుకోసం ఎంతకయినా, ఏం చేయడానికయినా సిద్ధం...."

ఆలోచనలలో వున్న నన్నుచూసి ఆయన కొంత మెత్తపడుతున్నాను అనుకున్నట్లున్నాడు.

"మీరింతగా ఆలోచిస్తున్నారు యీ సిన్న పని సేయడానికి మొన్న కాకినాడ వెళ్ళాను. ఆ మాష్టరుగారు నిమిషాలమీద పని కానిచ్చేశారు. మారు చెప్ప కుండా!...." ప్రోత్సహిస్తున్నట్టు లోక విరుద్ధమైన పని నేనేం చేయబోవడంలేదని నచ్చచెపుతూ మాటాడాడాయన.

ఆశ్చర్యపోయాను నేను. అంటే ఒక్క సబ్జక్టులోనే కాదన్నమాట. యిలా ఎన్నింట్లో అయితే అన్నింట్లోనూ డబ్బిచ్చి మార్కులు వేయించి ప్యాసు చేయిస్తాడన్నమాట....నా వళ్ళు మండింది. అందరిలాగే నేనూ డబ్బుకి లొంగి చెప్పిన పని

చేస్తానని ఎంతో నమ్మకంతో వచ్చిన ఆయన నమ్మకాన్ని సడలించాలి! డబ్బుకి లొంగని వాళ్ళు యీ లోకంలో కొందరయినా లేకపోలేదని నిరూపించాలి నేను! నన్నూ అందరితో జతపరచటం సహించలేకపోయాను. నా ప్రత్యేకత నిరూపించు కోవాలి. ఎవరో కాకినాడలో లెక్చరర్ మాట్లాడకుండా చేశారట. పాపం ఏం చేస్తాడు. పెళ్లాం పిల్లలు బరువులు బాధ్యతలు నెత్తిన వున్నవాడేమో డబ్బుమీద వ్యామోహ పడి వుంటాడు! నాకేం అలాంటి బాదర బందీలు లేవు! అన్యాయార్జితాలకి కక్కుర్తి పడాల్సిన అవసరం నాకేం లేదు. ఖచ్చితంగా చెప్పేయడానికి నిశ్చయించాను.

"చూడండి రెడ్డిగారూ, యిందాకటినించి నాకిలాంటి పనులు అలవాటు లేదని ఎన్నిసార్లు చెప్పినా మీరు వినిపించుకోకుండా ఏవో చెప్తున్నారు. ఎవరో చేసారని నేను చేయనక్కరలేదు! నా ఆశయాలని నా నిజాయితీని డబ్బుకి అమ్ముకోవాల్సిన అవసరం ఇప్పటివరకు నాకు కలుగలేదు. యిక ముందూ కలుగదని నా నమ్మకం. అంచేత మీరెంత చెప్పినా ఇలాంటి పని డబ్బుకోసం నేను చెయ్యను...."

ఆయన హతాశుడైనట్టు చూశాడు. ఆయన తన పని ఎంతో సులువుగా నిశ్చయంగా జరిగిపోతుందని, జరగడానికి కావల్సిన ఆయుధం తన దగ్గిర వుందన్న నిబ్బరంతో వచ్చివుంటాడు. వ్యవహారం యిలా ఎదురు తిరుగుతుందని ఎదురు చూడని ఆయనకి ఈ సంఘటన క్రొత్త. ఏం అనాలో ఇంకెలా నన్ను వశపరచు కోవాలో ఇదంతా ఆయన ఆలోచించని విషయం.

"తమరిలా అంటారని ఎన్నడూ అనుకోలేదు....ఏదో యీ మాత్రం సాయం చేస్తారని గంపెడాశతో వచ్చాను. అంత దూరం నించి...."ఎంతో దీనంగా అన్నాడు. అంత గంభీరమైన మనిషి అలా జావకారిపోవడం చూస్తే ఈయన....యింత డబ్బుండి కొడుకు తెచ్చే లక్ష ఒక ఏడాది ఆలస్యం అవుతుందని దాని కోసం యెందుకింత ఆరాటపడిపోతున్నాడు. ఈ మనిషికి డబ్బుమీద ఇంకా కాపీనమా అని పించింది. ఆ మాట అడగకుండా ఉండలేకపోయాను.

"మీరు ఈ పరీక్ష కోసం ఇంత ఆదుర్దా పడాల్సిన అవసరం నాకేం కన పడలేదు. లక్షాధికార్లు మీ అబ్బాయిని ఇంకో ఏడాదీ చదివించగలరు. అబ్బాయి పరీక్షలు ప్యాసయి ఆర్జించకపోతే రోజు గడవనివారు పడే ఆరాటం మీరెందుకు పడుతున్నారో నా కర్థం కావటంలేదు. ఏదో పూట గడవని వాళ్ళు వచ్చి తమ అబ్బాయి పరీక్ష కోసం ఆదుర్దాపడినా నన్ను సహాయం కోరినా అర్థం వుంది. అలాంటి స్థితిలో నేను జాలిపడి ఏదో సహాయం చేసినా అర్థం వుంటుంది. మీ అబ్బాయి విషయంలో అలాంటి అవసరం నాకేం కనపడడంలేదు! ఈసారి ఛాన్సుకి కష్టపడి చదివితే తప్పక ప్యాసవుతాడు. దానికోసం మీరు ఇంత ఆదుర్దాపడడం నన్ను

ఇరకాటంలో పెట్టి నాకిష్టంలేనిపని చేయించడానికి ప్రయత్నించడం....ఎందుకింత అవస్థ చెప్పండి.... పెద్దమనిషిగదా అని చెప్పదలసింది సౌమ్యంగానే చెప్పాను.

"అంతేనంటారా? నానాగడ్డి కరిచి మిగతా వాళ్ళచేత మార్కులు వేయించి మెడికల్ కాలేజీకి సీటు రిజర్వ్ చేయించిందీ అంతా వృధే నంటారా...." తనలో తాను గొణుక్కున్నాడు. నేను నవ్వాను.

"మెడికల్ కాలేజి సీటెక్కడికి పోతుందండి ఓ పదివేలు మీవి కావనుకుంటె ఎప్పుడు పడితే అప్పుడు మీ కోసం రెడీగా వుంటుంది.

ఆయన వుంగరాలు సవరించుకున్నాడు....తల గోక్కున్నాడు. ఇంకా ఏదో చెప్పాలని ఆరాటపడుతున్నాడు....ఎంతకీ వదిలేట్టులేడని నేను కుర్చీలోంచి లేచి కవరు తీశాను ఈయడానికి.

"అమ్మా, తవరెలాగో నిక్కచ్చిగా తన అభిప్రాయం చెప్పేశారు. ఏం చేస్తాను నా ప్రాప్తం ఇంతేననుకుంటాను....పోనీ చిన్న సాయంచేసి పెట్టండి. వాడి పరీక్ష ప్యాసయ్యాడో లేదో ఒక్కమారు పేపరుచూసి సెప్పేస్తే ఇక ఈ ఏడాదికి ఆ సీటు వద్దని రాసేస్తాను....అల్లు మావాడి కోనం ఓ సీటు అట్టేపెట్టారు....ఏదో సంగతి అల్లకి రాయాలిగందా...ఒక్కక్షణం పేపరు చూసి చెప్పేయండి సాలు..." ఆశగా అగాడు.

ఒక్కక్షణం సందేహించాను. నా అభిప్రాయం ఖచ్చితంగా చెప్పాను. నేనే సాయం చేయనని ఆయనకీ అర్థం అయింది. ఆ ఒక్క మాట చెప్పేస్తే...వెళ్ళి పోతాడు తొందరగా. ఆయన్ని వదుల్చుకోడానికి అంతకంటె మార్గం కనపడడం లేదు....సందేహిస్తూనే నంబరడిగాను...

"ఏమిటో మీరు ఎంతచెప్పినా నన్ను ఇరకాటంలో పెడుతున్నారు..." చిన్నగా విసుక్కుని డ్రాయరు తెరిచాను.

"క్షమించడమ్మా...నిజమే తమకి శ్రమ యిస్తున్నాను...మరేం అనుకోకండి..." అతి వినయంగా క్షమాపణ కోరాడు.

పేపర్లు బయటికి తీయకుండానే గబగబ ఆ నెంబరు కోసం వెతికాను ఆ కట్టల్లో! కావల్సిన నెంబరు కనిపించగానే మార్కులు మాత్రం చూచాను. పద్దెనిమిది మార్కులు! హు...ప్యాసుమార్కుకి సగానికి సగం తక్కువ.

ఆ మాట చెప్పాను. ఆయన మొఖం నల్ల బడింది. "పోయిందన్న ఓ పరీక్ష! అనుకుంటూనే వున్నాను..." అన్నాడు.

చూశారా. ఒకటి కాదు. రెండుకాదు తక్కువ! నేనేకాదు. ఎవరయినా యిలాంటి స్థితిలో ఏం సాయం చేయగలరు? చెప్పండి!" అన్నాను డ్రాయరు మూసేసి.

"ఆ...తవరు తల్చుకుంటే యిదో లెక్కా. తమకి దయలేదుగాని ఆ ప్రక్క ఒకటి నాలుగు క్రింద ఎంత సుళువుగా మారిపోతుంది...ఎటొచ్చి తవరు దయుంచాలి మాలాంటి వాళ్ళమీద!" అంటూనే మరోప్రక్క జేబులోంచి ఇంకో కవరుతీసి...! "హి...హి...మీ దయ, మా ప్రాప్తం! నీట ముంచినా పాల ముంచినా మీదేభారం... మరివస్తా. దయయుంచండి...." కవరు టేబిలు మీద పెట్టి...."వాడ్ని పాసుచేయించే భారం మీదే...." అని గబగబా వెళ్ళడానికి ఉద్యుక్తుడయ్యాడు.

తెల్లబోయాను నేను! ఇంత చెప్పినా ఇచ్చింది చాలక మరో ఇంత యిచ్చి ఎంత ధైర్యంగా వెళ్ళిపోతున్నాడు. డబ్బిచ్చి వెళ్ళిపోతే చచ్చినట్లు ఆ డబ్బు తీసు కున్నందుకు కృతజ్ఞతతో కాకపోయినా మరో దారి లేక ప్యాసు చేస్తానని ఆయన ఉద్దేశ్యం గాబోలు! కోపం కట్టలు తెంచుకుంది నాకు.

"ఆగండి" అన్నాను కఠినంగా. ఓ కవరు తీసి చూశాను. "ఐదు వందల రూపాయల నోట్లు." ఇది మార్కులు చూసి చెప్పడానికి లంచం! మరో కవరు తీశాను! మరో ఐదు వందలు! మార్కులు వేసేందుకు లంచం! వెయ్యి రూపాయలు ఒక సబ్జక్టు ప్యాసు అయ్యేందుకు. ఇలా ఎన్ని వేలు ఖర్చుపెడతాడో మొత్తం పరీక్ష ప్యాసనుపించుకోడానికి—

"హు ...మీరు ఏదో పెద్దమనుషులుగదా అని ఇంతసేపటినించి ఎంతో ఓపిగ్గా మాట్లాడాను, ఎంత చెప్పినా కూడా మీ యీ జబర్దస్తీ ఏమిటి? యీ డబ్బు తీసుకుని వెంటనే వెళ్ళండి....లేకపోతే పర్యవసానం ఎలా వుంటుందో మీరే చూస్తారు యిప్పుడే" వ్రేలితో గుమ్మం వంక చూపిస్తూ కోపంగా అన్నాను.

ఆయన మొహం ఎర్రబడింది! నా వంక తీక్షణంగా ఒకసారి చూసి, కవర్లు జేబులో పెట్టుకుని గబగబ వెళ్ళి కారులో ఎక్కి తలుపు దడాలున వేశాడు, కారు వెళ్ళిపోయింది. తేలిగ్గా నిట్టూర్చి వీధి తలుపులు వేసి వెనుదిరిగాను!

వెయ్యి రూపాయలు తక్కువ మొత్తం కాదు! కావాలంటే ఇంకా యిస్తాడు. అంత సొమ్ము వదులుకునే మనస్థయిర్యం ఎంతమందికి వుంటుంది? డబ్బు ప్రభావానికి లొంగేవాళ్ళున్నంత వరకు యీ చదువులు యిలాగే వుంటాయి.

ఓ మంచి పని చేశానన్న తృప్తితో గర్వంగా నన్ను నేను అభినందించు కున్నాను.

* * *

నమస్కారం, గుర్తున్నానా మీకు!" క్లాసు అయ్యాక స్టోర్ రూములోకి వస్తూంటే వరండాలో ఓ పెద్దమనిషి నమస్కారంపెట్టి పలకరించాడు ఆయన్ని ఎక్కడో చూసినట్లనిపించింది నాకు! కాని గుర్తురాలేదు. సరిగ్గా జవాబు చెప్పలేక అలా చూస్తూ నిల్చున్నాను ఆలోచిస్తూ గుర్తు చేసుకుంటూ.

"మరిచిపోయుంటారు. ఓసారి తమ దర్శనం కోసం బెజవాడలో మీ యింటికి వచ్చాను...."

బెజవాడలో! అంటే రెండేళ్ళ క్రిందట అన్నమాట! ఎప్పుడొచ్చాడో ఎందుకు వచ్చాడో సరిగా జ్ఞాపకం రాకపోయినా ఏదో ఆయన్ని చూసిన గుర్తుమాత్రం వుంది.

"మరిచిపోయారు తమరు. మావాడి పి.యు,సి. మార్కులకోసం మీకాడకి వచ్చానుగందా. అప్పుడే మరిసారు తమరు....అవునులెండి మాలాంటోళ్ళు ఎందరో వస్తుంటారు మీ కాడికి...." అదోలా నవ్వుతూ అన్నాడాయన.

చటుక్కున గుర్తువచ్చింది. అవును, రెండేళ్ళ క్రితం నేను బెజవాడలో వున్నప్పుడు కొడుక్కి మార్కులకోసంవచ్చి లంచం ఆశ చూపించి ప్యాసు చేయమన్న యీరవరెడ్డి.

"ఆ ఆ....అవునవును....గుర్తువచ్చారు.... చాలా రోజులయింది. వెంటనే గుర్తు పట్టలేకపోయాను... ఇక్కడికి ఏం పనిమీద వచ్చారు."

"మేము హైదరాబాదులోనే వుంటున్నాం యిప్పుడు... మా పిల్లని కాలేజీలో చేర్పించడానికి వచ్చాను..పి.యు.సి. క్లాసు నదువుతుందామ్మాయి..."

"ఆహా...!" అని ఇంకేం అనకుండా ముందుకు ఓ అడుగువేశాను నమస్కారంపెట్టి వెళ్ళొస్తాననిచెప్పి. కాని అంతలోనే వాళ్ళ అబ్బాయి సంగతి గుర్తొచ్చి అడగాలన్న కుతూహలంతో వెనక్కి వచ్చాను.

"అన్నట్టు మీ అబ్బాయి ఏం చేస్తున్నాడు యిప్పుడు ఏం చదువు తున్నాడు?" ఆయన అదోలా నవ్వాడు..." ఏదో తమ దయవల్ల మెడికల్ కాలేజిలో చదువు తున్నాడు!"

"ఆహా, మొత్తంమీద అన్నట్టుగానే అబ్బాయిని మెడిసన్ చదివిస్తున్నారన్న మాట. తరువాత... సెప్టెంబరు ఛాన్సులో ప్యాసయ్యాడా? మార్కులు బాగావచ్చాయా ఆసారి..." కుతుహలంగా అడిగాను.

సెప్టెంబరు కాదండి. మొదటి ఛాన్సులోనే ప్యాసయి పోయాడు. . వెంటనే మణిపాల్ లో చేర్పించేశాను..." అదోరకంగా అతనికళ్ళు మెరిసాయి.

తెల్ల బోయాను! మొదటి ఛాన్సులో ఎలా ప్యాసయ్యాడు? తక్కిన పేపర్ల సంగతి నాకు తెలియకపోయినా నా దగ్గిరవున్న పేపరులో పద్దెనిమిది మార్కులు వచ్చిన ఆ అబ్బాయి ఎలా ప్యాసయ్యాడు. ఆశ్చర్యంతో చూశాను బహుశా యూనివర్శిటి రిజిష్ట్రార్ కో డబ్బు బాగా ముట్టచెప్పి చేయించారేమో! అయివుంటుంది! ఈయన యింటికొచ్చి అడగబట్టి ఫలానా నెంబరుకి ఎన్ని మార్కులు వచ్చాయో నాకు గుర్తువుందికాని, లేకపోతే పేపర్లుదిద్ది పంపించాక ఎవరెవరు ప్యాసయ్యారో, ఫెయిలయ్యారో గుర్తు ఎవరికుంటుంది! అక్కడ ఏం చేసినా మాకు తెలియదు గదా!

"ప్యాసయ్యాడా?... మొదటి ఛాన్సులో ప్యాసయ్యాడూ? అదెలాగ పద్దెనిమిది మార్కులు వచ్చిన మీ అబ్బాయి ఎలా ప్యాసయ్యాడండీ ఆశ్చర్యపోతూ అడిగిన ట్టడిగాను...

"హీ...హీ తమ దయుంటే ప్యాసు కావడానికి ఏముందండీ... తమరు అలా అన్నారు కాని... మీ మనసెంత మంచిదో నాకు తెలీదా?...వెకిలి నవ్వు నవ్వాడు.

దిమ్మెరపోయాను. నా దయుంటే ప్యాసవడం ఏముందంటారు ఏమిటి?... నేనేం దయచూపలేదు నా చేత్తో ఇంకో అరమార్కు కూడా ఆ పేపరుమీద వేయ లేదు. నా మనసు చాలా మంచిదంటాడేమిటి? అంతా గందరగోళం అనిపించింది.

"మీరేం అంటున్నారో నా కర్థం కావడంలేదు. నేనేం మీ అబ్బాయికి మార్కులు వేయలేదే?... నేను దయచూపడం ఏమిటో నా కర్థంకావడంలేదు!..."

"పోనీండమ్మగారూ...అయిపోయిందానికి యిప్పుడెందుకు... ఏదో తమరు కాస్తంత జాలిగా ఆలోచించారు..,వాడి పరీక్ష ప్యాసయింది... అంతేసాలు నాకు..."

మళ్ళీ అదే మాట!

"రెడ్డిగారూ! మీరు ఏం అంటున్నారో నాకు అసలు తెలియడంలేదు. నాకు తెలిసి తెలిసి ఇలాంటి పని నేనెప్పుడూ చేయలేదు...మరి ఇదెలా సాధ్యం అయింది! దయచేసి తిన్నగా చెప్పండి!... నా కిలాంటిమాట రావటం ఇష్టంలేదు. ఇదెలా జరిగిందో చెప్పండి... మీరెవరికో యూనివర్శిటిలో డబ్బిచ్చి ప్యాసు చేయించి వుంటారు. నేను చేశానంటారేమిటి? కాస్త తీక్షణంగా అడిగాను.

"అబ్బే రామ రామ...తమరి సేత్తో తవరేసిన మార్కులే... మరి నేనెవరి కాడికి ఎల్లలేదండి...అందుకే తవరిది జాలిగుండె అన్నాను..." అని అతివినయంగా అన్నాడు.

ఒక్కొక్క మాట వింటూంటే ఈవజిల్ మరింత చక్కగా తయా రౌతూంది. బలే గడుసువాడు! మాట తిన్నగా చెప్పకుండా నేనే దయచూంచాపి నంటాడు. నా తల వేడెక్కింది, దాంతోపాటు కోపంకూడా వచ్చింది.

"ఇది చాలా బాగుంది రెడ్డిగారూ....నా చేత్తో నేను ఒక మార్కు వేయలేదు. మీ అబ్బాయి పేపరుమీద మరి ఇదంతా ఎలా జరిగిందో మీకే తెలియాలి....అవును లెండి మీ దగ్గరున్న డబ్బుతో మీరు సాధించలేనిది ఏమీ వుండదు....కానీ అనవసరంగా యిలాంటి వాటిలో యిరికించి నా పేరుకి ప్రతిష్ఠలేకండ యిలాంటివి నాకిష్టం లేదు." కఠినంగా అన్నాను.

ఆయన అదోలో నవ్వాడు..."అలా అనేస్తే నేనేం చెప్పగలమ్మగారూ—నా మాటమీద మీకు నమ్మకం లేకపోతే నేనేం చెయ్యగలను పోనీలెండి గాని...నేను మూడో క్లాసులోనో నాలుగో క్లాసులోనో ఓపాఠం చదూకున్నాను అదెవరో బెంగాలీ ఆయన విద్యాసాగరో మరెవరో ఓ ఠింటికివిందుభోజనానికిఎల్లాడట..మామూలుబట్టలేసుకుని..ఆడి బట్టలు చూచి ఎవరూ లోపలికి రానీలేదంట. ఆపళాన యింటికెళ్ళి మంచి బట్టలేసుకుని గుర్రబ్బంగ్గీలో రాగానే అందరూ ఎదురెళ్ళి ఆహ్వానించారట,...అప్పుడనుకున్నాడంట ఆయన ఈ గౌరవం డబ్బుకిగాని, మనిషికా అని..."

ఆయన మాట్లాడేది ఏమిటో అర్థంకాక ఈ అనందర్భపు మాటలేమిటని విసుగువచ్చింది నాకు. "యిదంతా మీరెందుకు చెపుతున్నారు? నేన్నన్నదానికి దీనికి, సంబంధం ఏమిటి?

రెడ్డిగారు వ్యంగ్యంగా నవ్వాడు....."అ....అ....అదే. యిన్నాళ్ళు నేనూ డబ్బుకే యిలువ. వేపానికే విలువ అందరూ యిస్తారని ఆయనలాగే అనుకున్నాను. .. కానీ....మీకాడికి వచ్చే సరికి అదంతా తప్పయిపోయింది. నా కారు నా లచ్చలు, నా వుంగరాలు..·నా వందలు, నా ద్రాక్షపళ్ళు ఏవీ చేయలేని పని అరటిజను బత్తాయి పళ్ళు...జంధ్యంపోగు నీరు కావి అంగొస్త్రం చేసేసింది.—మరి అక్కడనించి యీ క్రొత్తపాఠం నేర్చుకున్నాను...వస్తానమ్మా చాలా సేపు నిలబెట్టేశాను మిమ్మల్ని... మా అమ్మాయిని కూడా ఓ కంట కనిపెట్టి సూడండి."

తెల్లపోయి చూస్తున్న నాకు ఓ నమస్కారం పెట్టి నవ్వుకొంటూ వెళ్ళిపోయాడు యీరపరెడ్డి.

స్టాఫ్ రూములోకి ఎలా వచ్చి కూర్చున్నానో నాకే తెలియదు. అరటిజను బత్తాయిపళ్ళు నీరుకావి అంగొస్త్రం. జంధ్యంపోగు...నా బుర్రలో గిర గిర తిరిగాయి. రెండేళ్ళ క్రితం జరిగినది గుర్తు తెచ్చుకొడానికి ఎక్కువ ప్రయత్నం అవసరం లేకపోయింది. గుర్తురాగానే ఆవేశంతో ఆగ్రహంతో వణికిపోయాను. ఎంత మోసం ఎలాంటి పన్నాగం

ఎముకల గూడులా వున్న సద్బ్రాహ్మణుడు మూడు మూరల అంగొస్త్రంతో, జంధ్యం—పోగులతో విభూతి పట్టెలతో వున్న ఆయవారపు బ్రాహ్మణుడు గుర్తుకి వచ్చాడు.

ఆయన జాలికథ విని కరిగిపోయాను. తిండి లేదన్నాడు. భార్య రోగిష్ఠి దన్నాడు! ఐదుగురు ఆడపిల్లలు గుండెలమీద కూర్చున్నారన్నాడు: ఏకైక పుత్ర రత్నం ఈ పరీక్ష ప్యాసవుతాడని గంపెశాశ పెట్టుకున్నాడు. ఆ పరీక్ష ప్యాసయితే ఏదో ఆఫీసులో ఎవరో ఆఫీసరు కాళ్లపట్టుకుని ఉద్యోగం స్థిరపరుస్తాడట, ఆ ఉద్యోగంకి యీ పరీక్ష ప్యాసవాలట ఆ ఆఫీసరు ఉద్యోగం యిస్తానని మాటిచ్చాడట, పరీక్ష ప్యాసయితే చాలట. అబ్బాయి ఎంతో కష్టపడి చదువుకున్నాడు. ఈ పరీక్షకి ముందు జ్వరంవచ్చి యీ ఒక్క పేపరే కాస్త పాడుచేసానన్నాడట కొడుకు. నేను దయ చూపకపోతే తిండిలేక మలమల మాడిపోతాం. అని కన్నీరు కార్చాడు. నేను యీ సాయం చేయకపోతే అందరం కలిసి యీ కృష్ణలో కట్టకట్టుకుని చావటం మినహా మరోదారి లేదని దీనాతిదీనంగా ప్రార్థించాడు. జబ్బుతో తీసుకుంటున్న ఆ తల్లీ యీ కొడుకు చేయబోయే ఉద్యోగం కోసమే ప్రాణాలు నిలుపుకుందని జాలిగా చెప్పాడు. కుచేలుడు ఆనాడు కృష్ణపరమాత్మ అటుకులు తెచ్చి యిచ్చినట్టు అరడజను బత్తాయిపళ్ళు మినహా ఏమీ ఇవ్వలేని పేదవాడినని పాదాలదగ్గిర పెట్టాడు. నావల్ల కాదన్నా యిలాంటి పని చేయలేనన్నా...నా కాళ్ళని పట్టేసుకున్నాడు... మీరు కాదంటే మళ్ళీ గత్యంతరం లేదంటూ వలవల ఏడ్చాడు...నన్ను యిబ్బందిలో పెట్టి యిరకాటంలో పడేసి సానుభూతి సంపాయించి జాలితో కరిగేటట్టు కన్నీటి కథ చెప్పి నేను మాటిచ్చేవరకు అభయం ఇచ్చేవరకు కాళ్ళ వదలని ఆ బ్రాహ్మడు గుర్తొచ్చాడు...ఎంత దగా...ఎంత మోసం యీ రెడ్డి ఎంత నాటకం ఆడాడు. ఐదో పదో ఆ బ్రాహ్మడి చేతిలో పెట్టి తన అవసరానికి ఎంత చక్కగా వినియోగించుకున్నాడు. నేనన్నమాట ఆధారంతో ఎంత పన్నాగం పన్ని నా కళ్ళు కప్పాడు.

"నన్నెంతలో బోల్తాకొట్టించాడు అయినా నేనెలా మోసపోయాను" ఆ రెడ్డి కొడుకు నెంబరు ... యీ బ్రాహ్మడు చెప్పిన నెంబరూ ఒకటేనన్న గుర్తులేనంత మందమతి నెలా అయ్యాను? పేపరుచూచి మార్కులు వేసేటప్పుడయినా పోలిక పట్టలేనంతగా నా బుర్ర ఎలా మొద్దుబారిపోయింది? అంతలా నా కళ్లు ఎలా మూసుకుపోయాయో!?

హు...యీ పద్దెనిమిది మార్కులు అబ్బాయి రేపొద్దున డాక్టరయి ప్రజాసేవ చేయడానికి రానుంటే ఆపాలన్నా ఆపడం నా తరమా?...యిలాంటి దేశోద్ధారకులు దేశానుద్ధరించడానికి రానుంటే నాలాంటి వాళ్ళు కళ్లు మూసుకుపోయే ఉండాలి. నా చేతిలో ఏం వుంది? ఇలాంటివి ఆపడానికి?.,.నేను నిమిత్త మాత్రురాలిని అంతే! చాతకాని నవ్వు ఒకటి నవ్వుకుని క్లాసుకు బయలుదేరాను.

★